క్లుప్తంగా

నేటి నుంచి స్లాట్ ప్రారంభం

తాండూరు: వికలాంగులు సదరం క్యాంపు కోసం నేటి (శనివారం) మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని పెద్దేముల్ ఎంపీడీఓ లక్ష్మప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు స్లాట్ బుకింగ్ ప్రారంభం అయిందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తెలియజేశారు.

సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

కుల్కచర్ల: వికలాంగులు సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శోభ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వికలాంగులు ఈ నెల 18వ తేదీ తాండూరు, 26వ తేదీన వికారాబాద్‌లో జరిగే క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు మండల మహిళా సమాఖ్యలో సంప్రదించాలని సూచించారు.

కండ్లపల్లివాసికి డాక్టరేట్


మనేందర్ (ఫైల్)

పూడూరు: పూడూరు మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన ఎం. మనేందర్‌కు శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 2017లో ఉస్మానియా యూనివర్సిటీలో భౌతికశాస్త్రంలో పీహెచ్‌డీ ప్రవేశం పొంది.. ఎలక్ట్రికల్ స్టడీస్ ఆఫ్ మాగ్నెటో, ఎలక్ట్రిక్ వై –టైప్ కోబాల్ట్ బెస్ట్ ఎక్సా పెరాయిడ్స్ అనే అంశంపై పరిశోధన చేసి యూనివర్సిటీకి సమర్పించారు. దీంతో యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేసింది. నరేందర్ డాక్టరేట్ పొందడంపై గ్రామస్తులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.

25 నుంచి ఆశవర్కర్ల సమ్మె


అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆశవర్కర్లు ఈనెల 25 నుంచి సమ్మెకు దిగనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనం రూ.18000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి మంగమ్మ, సుజాత స్వరూప యాదమ్మ, ఉమాదేవి, రమాదేవి, పద్మమ్మ, మధు, పుష్పమ్మ, అరుణ సునీత, పద్మ పాల్గొన్నారు.

సబ్బండవర్గాలకు అండ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, నేతలు

కుల్కచర్ల: సబ్బండ వర్గాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో 65మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల కష్టాలు తెలుసుకున్న సీఎం కేసీఆర్ ఆడపడుచుల పెళ్లిళ్లు పేద ప్రజలకు భారం కావొద్దని కళ్యాణలక్ష్మి పథకం తీసుకువచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అనర్హులకు 'దళితబంధు'


ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పరిగి: స్థానిక ఎమ్మెల్యే దళితబంధును అనర్హులకు ఇస్తున్నారని సీపీఐ, దళితహక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మిట్టకోడూర్‌లో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుపేద దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాన్ని స్థానిక నాయకులు నీరుగారుస్తున్నారని ఆరోపించారు. కమీషన్లకు ఆశపడి ఉన్న వారికే దళితబంధును ఇస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసమే దళితబంధును వాడుకుంటున్నారని వాపోయారు. గ్రామసభ ద్వారా అర్హులకు పథకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళితసంఘాల నాయకులు మాణిక్యం, యాదయ్య పాల్గొన్నారు.

60 సీట్లు కేటాయించాలి

తాండూరు టౌన్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు కాంగ్రెస్ పార్టీ 60 టికెట్లు కేటాయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అనంతరం శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు సీట్లు కేటాయించాలని, వికారాబాద్ జిల్లాలో కనీసం రెండు సీట్లు ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్ చేసిన తప్పిదాన్ని సాకుగా చూపి బీసీలకు అన్యాయం చేయొద్దన్నారు. అనేక ఏళ్లుగా బీసీలు కాంగ్రెస్‌కు అండగా ఉంటున్నారని తెలిపారు.

వేలిముద్ర వేయాల్సిందే..

- రేషన్‌కు ఈకేవైసీ తప్పనిసరి
- బియ్యం దుర్వినియోగానికి చెక్


వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారు (ఫైల్)

దౌల్తాబాద్: రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియ ప్రారంభమైంది. కార్డులో పేర్లు ఉన్న కుటుంబసభ్యులందరూ చౌకధరల దుకాణానికి వచ్చి ఈ కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రేషన్‌డీలర్లు అనుసంధాన ప్రక్రియను ప్రారంభించనున్నారు. కొత్తరేషన్ కార్డుల జారీకి ముందు అనర్హుల కార్డులను ఏరివేసే కార్యక్రమం మొదలైంది.

రేషన్‌దుకాణాల్లోనే ఈ కేవైసీ

ఆహార భద్రత కార్డు (రేషన్‌కార్డు)లో ఉన్న కుటుంబ సభ్యులకు ఒకొక్కక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. కార్డులో పేరున్న ఏ కుటుంబసభ్యులైన దుకాణానికి వెళ్లే రేషన్‌బియ్యం అందిస్తున్నారు. అయితే, కొన్ని కార్డుల్లో కొందరు చనిపోవడం, కూతుళ్ల పెళ్లిళ్లు చేసుకుని అత్తారింటికి వెళ్లిపోయారు. అయినా వారందరికీ నేటికీ బియ్యం అందుతూనే ఉన్నాయి. బియ్యం దుర్వినియోగం కావొద్దనే ఉద్దేశంతో, ప్రభుత్వం కార్డులోని సభ్యులందరి పేర్లు ధ్రువీకరించుకోవడానికి చౌకధరల దుకాణానికి వచ్చి ఈ పాస్ యంత్రంలో వేలిముద్రలు వేయాలని నిర్ణయించింది. డీలర్లు ఈ–కేవైసీ పునరుద్ధరించుకోవాలని లబ్ధిదారులకు సమాచారం అందిస్తున్నారు. వేలిముద్రలు రాకుంటే ఐరిష్ ద్వారా అనుసంధానం చేస్తున్నారు. కాగా, రేషన్‌కార్డులోని సభ్యుల ఈ–కేవైసీ ప్రక్రియ డీలర్లకు తలనొప్పిగా మారనుంది. వృద్ధుల, పిల్లల వేలిముద్రలు రాకపోవడం, కొంతమంది లబ్ధిదారులు విదేశాల్లో పట్టణాల్లో వివిధ పనుల నిమిత్తం స్థిరపడ్డారు. వారు రాకపోతే కార్డులో నుంచి వారి పేర్లు తొలగించే అవకాశం ఉంది.

తప్పుడు ప్రచారం ..

త్వరలో కొత్త రేషన్‌కార్డుల జారీ ఉంటుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుండగా అదంతా తప్పుడు ప్రచారమని అధికారులు కొట్టి పారేశారు. కాగా, రీ డూప్లికేట్ పూర్తయాకే కొత్త రేషన్‌కార్డుల జారీ ఉంటుందని సమాచారం. పెళ్లయిన వారితో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు నూతనంగా జన్మించిన పిల్లలను కార్డులో చేర్చుకునేలా వెసులుబాటు కల్పించే అవకాశముంది.

వారిని అసెంబ్లీలో అడుగు పెట్టనీయం

- రోహిత్‌రెడ్డిని ఓడించేందుకు సిద్ధం కావాలి
- మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి చిన్నారెడ్డి, తదితరులు

తాండూరు: కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన 12 మంది ఎమ్మెల్యేలను రానున్న ఎన్నికలలో ప్రజలు తుక్కుతుక్కుగా ఓడించడమే లక్ష్యంగా పని చేయాలని మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నేటి నుంచి రెండు రోజుల పాటు సీడబ్ల్యూసీ సమావేశం జరగనుంది. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ ప్రతినిధులు, ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు పార్టీ అధ్యక్షులు హాజరుకానున్నారు. 17వ తేదీన తుక్కుగూడలో 10లక్షల మంది కాంగ్రెస్ శ్రేణులతో జరిగే బహిరంగ సభలో సోనియాగాంధీ ఎన్నికల మెనిఫెస్టో విడుదల చేస్తారన్నారు. అందులో 5 గ్యారంటీ స్కీమ్‌లు ప్రధానమైనవన్నారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా అధిష్టానం స్టాటజి కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నానన్నారు. తాండూరులో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌తో లాలూచి పడి పార్టీ మారారన్నారు. అలాంటి ఎమ్మెల్యేలను ప్రజలు తుక్కుతుక్కుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హబీబ్ లాల, మున్సిపల్ కౌన్సిలర్లు, మమత, మధుబాల, మాజీ కౌన్సిలర్ చెన్‌మిళ్ల మల్లికార్జున్, బస్వరాజ్, నాయకులు నగేష్, వెంకటయ్య, బీంశంకర్, రాము తదితరులున్నారు.

సీఎం కేసీఆర్‌తోనే సుస్థిర పాలన

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బొంరాస్‌పేట: సీఎం కేసీఆర్‌తోనే పల్లెల్లో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతోందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రేగడిమైలారంలో రూ.20లక్షలతో జాతీయరహదారి పక్కన నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించి పలురకాల భవనాలను ఏర్పాటు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. పల్లెదవాఖానా, గ్రామపంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, ప్రతిఇంటికి సంక్షేమ పథకాలు అందించి పల్లెలను పట్టణాలుగా మారుస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, బురాన్‌పూర్‌లో రూ.2కోట్ల 22లక్షలతో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. పార్టీ నాయకులు మధుయాదవ్ ఉన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం


విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్‌రూరల్ : పట్టణంలోని శ్రీజగద్గురు నిరంజన మఠంలో వైభవంగా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాస ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రావణమాస పాఢ్యమి మొదలుకొని శ్రావణ బహుళ చతుర్థి వరకు నెల రోజుల పాటు నిత్య రుద్రాభిషేకం నిర్వహించగా శుక్రవారం మహా రుద్రాభిషేకంతో ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీనిరంజన మఠంలో శ్రీబసవలింగేశ్వరస్వామివారికి మఠాధిపతులు పూజ్యశ్రీ డాక్టర్ సిద్ధలింగమహాస్వామి సమక్షంలో పూజారులు మఠం విజయకుమార్, గడ్డం చంద్రశేఖర్, సాయిగణేష్, మహేశ్‌స్వామిలు శాస్త్రోక్త మంత్రోచ్చారణలతో మహారుద్రాభిషేకం పూజలు చేశారు. గణపతి పూజ, సంకల్పం, రుద్రాభిషేకం, అర్చన, అష్టోత్తర శతనామావళితో బిల్వ దళాలతో శ్రీబసవలింగేశ్వరస్వామివారికి అర్చిస్తూ విశేష అలంకరణ చేశారు. అనంతరం ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఆలయాల ఈఓ బాలరాజ్, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నవాబుపేట: నవాబుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులకు ఎమ్మెస్సీ ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కళాశాల ప్రిన్సిపాల్, లేదా నోడల్ అధికారి గారికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మిగతా వివరాలకు కళాశాల 9963 102409 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అనుమతి తప్పనిసరి

అనంతగిరి: గణేష్ మండపాల కోసం పోలీసు అధికారుల పర్మిషన్ తీసుకోవాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డీజే, లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదన్నారు. జిల్లాలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. నిర్మాహకులు, ప్రజలు, పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు. మండపాల దగ్గర ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా బ్యాగులు ప్లాస్టిక్ సంచులు వదిలినట్లయితే వాటిని తాకరాదన్నారు.

చౌడాపూర్‌కు పీహెచ్‌సీ కేంద్రం మంజూరు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలానికి నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నూతనంగా చౌడాపూర్ మండలాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నదానం మహాదానం

మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్ : అన్నం పరబ్రహ్మ స్వరూపమని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని చితారు పేరుమాళ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. శ్రావణమాసం ముగింపు సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మనకు ఉన్న దాంట్లో కొంత పేదలకు దానం చేయాలన్నారు. అన్నదానం చేయడం వల్ల మరోకరి ఆకలి తీర్చినవారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, కిష్టప్ప, ఎల్లప్ప, నర్సిములు, గోపాల్, రాములు, సాయిరెడ్డి, మల్లప్ప, సురేష్, కృష్ణ పాల్గొన్నారు. పట్టణంలోని తెలుగేరి వీరాంజేయ స్వామి ఆలయంలో మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్ అన్నదానం చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం


పూడూరు: పార్టీలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

పూడూరు: కాంగ్రెస్ పార్టీ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఏకకాలంలో రుణమాఫీ చేసిందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద ఉమ్మెంతాల్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఉమ్మెంతాల్, రాకంచర్ల గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు , కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పరిగి నియోజకవర్గంలో 42వేల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలే నేటికీ గ్రామాల్లో కనిపిస్తున్నాయి ఆరోపించారు. అధికారంలోకి రాగానే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఏకకాలంలో 2లక్షల రుణమాఫీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, షకీల్, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్, తిర్మల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక

ధారూరు: మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చింతకుంట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి శుక్రవారం కాంగ్రెస్‌లో పలువురు నాయకులు చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని మాజీమంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ జోస్యం చెప్పారు. ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు ఇవ్వడం, తర్వాత తన వారిని కోర్టుకు పంపి నిలిపివేయించడం బీఆర్‌ఎస్ పనితీరని మండిపడ్డారు. కనీసం వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణ సహాయం లేకుండా మొండిచేయి చూపారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి , హరిదాస్‌పల్లి మాజీ సర్పంచు నర్సిరెడ్డిలు పాల్గొన్నారు.

విజయభేరి సభను జయప్రదం చేయండి


వికారాబాద్ అర్బన్: మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వికారాబాద్ అర్బన్: ఈ నెల 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని బహిరంగ సభ కోఆర్డినేటర్ మాజీమంత్రి చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ నివాసంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఆదివారం తుక్కుగూడలో జరిగే సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కేఎల్ఆర్ పూజలు

పెద్దేముల్: విజయభేరి మహాసభకు మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి కోరారు. సందర్భంగా శుక్రవారం మండలంలోని శంభులింగేశ్వర ఆలయంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో ప్రత్యేక పూజలు చేశారు

సోనియమ్మ రుణం తీర్చుకోవాలి

దౌల్తాబాద్: విజయభేరి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌భాన్‌సింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్రావులు అన్నారు. తెలంగాణ ఇచ్చి న సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని, సభకు భారీగా తరలిరావాలని కోరారు.

తుక్కుగూడకు కదం తొక్కాలి

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ చేపట్టిన తుక్కుగూడ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున కదంతొక్కాలని బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, శేఖరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయా మండల కేంద్రాల్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. బహిరంగ సభకు ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరవుతున్నారని చెప్పారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, రాజేశ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులున్నారు.

పంటలు ధ్వంసం

కునుకు లేకుండా చేస్తున్న అడవి పందులు


జొన్న పంటను పాడు చేసిన అడవిపందులు

దౌల్తాబాద్: అడవి పందులు పంటలను నాశనం చేస్తున్నాయి. కంది, జొన్న పంటను రాత్రులు తొక్కి పాడు చేస్తున్నాయి. చేతికి వచ్చిన జొన్న పంటను కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఈర్లపల్లి, గోకఫసల్‌వాద్, దౌల్తాబాద్, అంతారం, గుండేపల్లి, నాగసార్, చల్లాపూర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు పంటలను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రుల్లో నిద్ర పోకుండా పొలాల వద్దకు వెళ్లి డప్పు చప్పుడు చేస్తూ పంటలకు కాపాల ఉంటున్నామని వాపోయారు. అయినా పందులు గుంపులుగుంపులుగా వచ్చి పంటను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ పంట పొలాల్లోకి అడవి పందులు రాకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పత్తి పంటకు పందుల బెడద

మోమిన్‌పేట: మొక్కజొన్న పంటను సాగు చేస్తే విత్తనం విత్తుకొన్న మొదలు మార్కెట్‌కు తరలించే వరకు రాత్రింబవళ్లు అడవి పందుల నుంచి రక్షించుకోవాలి. దీంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పత్తిని సాగు చేస్తున్నారు. అయినా పత్తిని కూడా వదలడం లేదని రైతులు వాపోతున్నారు. వచ్చిన పత్తికాయలను వచ్చినట్లు తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను కాపాడుకోవడానికి పొలం చుట్టూ చీరలను కట్టుతున్నారు. అటవీ శాఖ అధికారులు పందుల నుంచి తమ పంటలను కాపాడాలని రైతులను కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి


ర్యాలీలో పాల్గొన్న నేతలు, అంగన్‌వాడీలు

కొడంగల్ రూరల్ : అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ టీచర్ల కనీస వేతనం 26వేలు చేయాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ సిబ్బంది నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందికి రిటైర్‌మెంట్ తర్వాత నెల నెలా పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. బీఎల్ఓల డ్యూటీని రద్దు చేయాలని, నెలకు రెండు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు నరసమ్మ, పరిగి ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, అధ్యక్షురాలు రెహనాబేగం, కార్యదర్శి నవనీత, శివలీల, పత్నాబాయి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తురు చంద్రయ్య, కేఎన్‌పీఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తురు లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొడంగల్‌పై వివక్ష తగదు

కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గంపై అధికారులు వివక్ష చూపుతున్నారని విద్యావంతుల వేదిక కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యప్ప, ప్రధాన కార్యదర్శి గౌరారం గోపాల్, సభ్యులు వెంకటేశం, అశోక్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వికారాబాద్ జిల్లాలో విలీనం అయినప్పటి నుంచి వివక్ష కొనసాగుతుందన్నారు. జిల్లాల విభజనలో పాలక వర్గం కొడంగల్‌కు అన్యాయం చేసిందని విమర్శించారు. మూడు మండలాలను వికారాబాద్‌లో కలిపి రెండు మండలాలను ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఉంచారని తెలిపారు. వికారాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి నిర్లక్ష్యం కారణంగా కొడంగల్ నియోజకవర్గంలో పోటీ పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదన్నారు. పోటీ పరీక్షలు ఎప్పుడు నిర్వహించిన కొడంగల్‌కు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరుల్లో టెట్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి కొడంగల్‌లో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. కొడంగల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భవనం విశాలమైన తరగతి గదులు, జూనియర్ కళాశాలలో విశాలమైన గదులు ఉన్నాయని అన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ విషయంపై మంత్రి సబితారెడ్డికి, ఎమ్మె ల్యే నరేందర్‌రెడ్డికి వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

కిట్లు ఇస్తున్నారు.. డబ్బులు జమ కావడం లేదు

సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచుల ఆరోపణ


ధారూరు: సభలో అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ రవి

ధారూరు: కాన్పులైన మహిళలకు కేసీఆర్ కిట్లు ఇస్తున్నారు. డబ్బులు మాత్రం జమ కావడం లేదని మున్నూరు సోమారం ఎంపీటీసీ రవి ఆరోపించారు. శుక్రవారం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన ధారూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఉమ స్పందిస్తూ బడ్జెట్ వచ్చిన తర్వాత ఖాతాల్లో వేస్తారని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలు, గాలులకు పొలాల్లోని విద్యుత్ స్తంభాలు వంగిపోయాయని, వాటిని సరిచేయాలని విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆన్‌ఆఫ్ సిస్టం కూడా లేదని , తరుచూ పశువులు, మేకలు విద్యుత్ షాక్‌కు గురయే మృతి చెందుతున్నాయని వాపోయారు. ఉపాధిహామీ పథకం కూలీలకు గత మూడు నెలలుగా డబ్బులు రావడం లేదని నిలదీశారు. గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసిన లబ్ధిదారుల్లో ఎవరెవరికి మంజూరు అయ్యాయని మున్నూరుసోమారం ఎంపీటీసీ రవి ప్రశ్నించగా మా పరిధిలో లేని విషయాన్ని ఏం ఎలా చెబుతాం, మంత్రి ద్వారా మంజూరు అవుతాయని ఎంపీడీఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు కేంద్ర ప్రభుత్వ నిధులతో మనుగడ సాధిస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వకుండా మొండి చేయి చూపుతుందని అంతారం సర్పంచ్ నర్సిరెడ్డి ఆరోపించారు. అలాగే, ఇంకా చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, కొత్త రుణాలు ఇవ్వడం లేదని సర్పంచులు వాపోయారు. పశువులకు రోగాలు వస్తే ప్రైవేటుగా మందులు కొనుగోలు చేసి వైద్యం చేయిస్తున్నామని మోమిన్‌కలాన్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ధారూ రు పీఏసీఎస్ పరిధిలోని 500 మంది రైతులకు రూ. 3 కోట్ల రుణమాఫీ వచ్చిందని చైర్మన్ సత్యనారాయణరెడ్డి సభ్యులకు వివరించారు. గ్రామ పంచా యతీల్లో చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులకు గురవుతున్నామని అంతారం సర్పంచ్ నర్సిరెడ్డి పేర్కొన్నారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయకుమార్, జెడ్పీటీసీ సుజాత, పంచాయతీ రాజ్ డీఈ మాధవరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, హరిదాస్‌పల్లి సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులు హాజరు కాకుంటే చర్యలు: ఎంపీపీ

వివిధ శాఖల అధికారులు, సిబ్బంది గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించకుండా బేఖాతరు చేస్తున్నారని సభ్యులు ఆరోపించారు. మీరు నిర్వహించే కార్యక్రమాలకు సర్పంచులు, ఎంపీటీసీలను ఆహ్వానించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ విజయలక్ష్మి హెచ్చరించారు.